సస్యరక్షణతో అధిక దిగుబడులు

- పూత దశలో కందిపంట
- పురుగు ఆశించకుండా అప్రమత్తంగా ఉండాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు


ఏపుగా పెరిగిన కందిపంట

గుంతకల్లు రూరల్: సమగ్ర సస్యరక్షణతోనే కంది సాగులో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కందిపంట అత్యంత కీలకమైన పూతదశకు చేరుకున్న నేపథ్యంలో పంటకు పురుగు ఆశించకుండా రైతన్నలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. దాదాపు 70,000 ఎకరాల సాగుభూమి ఉన్న గుంతకల్లు మండలంలో ఏటా దాదాపు 60 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లోనూ, మరో 10 వేల ఎకరాల్లో రబీ సీజన్‌లోనూ పంటసాగు అవుతుంది. ఇందులో ప్రతి ఖరీఫ్ సీజన్‌లోనూ దాదాపు 50 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతన్నలు సాగు చేస్తూ వస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల వరకూ ఖర్చుచేసి సాగుచేసే వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల కారణంగా ఏటా రైతన్నలకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తోంది. ఈ క్రమంలో అన్నదాతలు తక్కువ పెట్టుబడితో సాగయ్యే కందిపంట సాగుపై దృష్టి సారించారు. కంది సాగులో ఎకరాకు రూ. 5 వేల నుంచి రూ.7 వేల వరకూ మాత్రమే ఖర్చు రావడం, దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో వస్తుండటంతో గడచిన రెండేళ్లలోనే మండలంలో కంది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గడచిన రెండేళ్లలో 15 వేల నుంచి 18 వేల ఎకరాల్లో కందిపంట సాగు అయితే ఈ ఏడాది ఏకంగా 25 ఎకరాలకు పైగా కందిపంటను సాగు చేశారు.

■ పూత దశ కీలకం

కందిసాగులో అత్యంత కీలకమైంది పూత దశ. ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలను పాటిస్తూ పంటను జాగ్రత్తగా కాపాడుకోగలిగితే ఎకరాకు 8 క్వింటాళ్ల వరకూ దిగుబడులు పొందే అవకాశం ఉంది. పూత దశలో తెగుళ్లు, పురుగు నివారణపై ప్రత్యేక దృష్టి సారించి పంటను కాపాడుకోవాలి.

మారుక మచ్చల పురుగు

కంది పంట ఆకులను, పూతను కలిపి గూడుగా చేసుకుని తిష్ట వేసే మారుక మచ్చల పురుగు ముందు ఆకులను తినేస్తుంది. దీనివల్ల పూత రాకుండా చేస్తుంది. కాయదశలో ఉన్న కాయలను కూడా తినేసి పంటకు తీవ్రనష్టం కలిగిస్తుంది. ఈ పురుగు నివారణకు వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్లతో పిచికారీ చేసుకోవాలి. లేదా క్లోరోఫైరీపాస్ 2.5 ఎంఎల్ లేదా ఎమోమైకిన్ బెంజోఏయిట్ 0.4 గ్రాముల మందును లీటర్ నీటిలో కలుపుకుని ఎకరాకు 200 లీటర్లతో పిచికారీ చేయాలి.

శెనగపచ్చ పురుగు

అక్టోబర్ ప్రారంభం నుంచి కందిసాగులో పూత దశ మొదలవుతుంది. అదే సమయానికి పంటను ఆశించి శెనగపచ్చపురుగును వెంటనే గుర్తించకపోతే రైతన్నలు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. పంటను శనగపచ్చ పురుగు ఆశించడం వల్ల ఆకు ముడత తెగులు రావడంతోపాటు, పూత రాలిపోతుంది. మొగ్గను తినే శనగపచ్చ పురుగు, కాయ దశలో కాయను కూడా తిని భారీ నష్టాన్ని కలుగజేస్తుంది. శనగ పచ్చ పురుగు నివారణకు థయోడిక్ కార్బ్ 1 గ్రాము ఒక లీటర్ నీటికి లేదా నోవాల్యురాన్ 1 ఎంఎల్ ఒక లీటర్ నీటికి లేదా సైపర్ మెత్రిన్ 1 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేసుకోవాలి.

■ కాయ ఈగ:

కంది పంట కాయ దశలో పంటను ఆశించే ఈ పురుగు కంటికి కనిపించకుండా కాయ లోపలికి చేరి విత్తనాన్ని తినడం ప్రారంభిస్తుంది. ఈ పురుగును వెంటనే గుర్తించకపోతే గింజలు పూర్తిగా బొక్కలు పడి పంట నాణ్యత భారీగా తగ్గిపోతుంది. నివారణకు మోనోక్రోటాఫాస్ 1.6, ఎంఎల్ లేదా డైమిథ్ ఏయిట్ 2 ఎంఎల్, లేదా ప్రొఫెలో పాస్ 2 ఎంఎల్ మందును ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల నీటితో పిచికారీ చేయాలి.

పెట్టుబడి తక్కువ



పెట్టుబడి ఖర్చు తక్కువ కావడంతో రైతులు ఈ ఏడాది ఎక్కువమంది కంది పంటను సాగు చేశారు. పంటసాగు చేసినప్పటి నుండి క్రమం తప్పకుండా వర్షాలు పడుతున్నాయి. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అవసరమైన సలహాలు, సూచనలిస్తున్నారు. మరో మూడు నెలలు కంది పంటను కాపాడుకోగలిగితే ఈ సారి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

– విజయ్ కుమార్, .రైతు, తిమ్మాపురం

రైతులు అప్రమత్తంగా ఉండాలి



తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలను అందించే పంటల్లో కందిపంట ప్రధానమైనది. పంటను జాగ్రత్తగా కాపాడుకోగలిగితే ఎకరాకు 8 క్వింటాళ్ల వరకూ దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం కంది పంట కీలకమైన పూత దశకు చేరుకున్న సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంటను ఆశించే శెనగపచ్చపురుగు, మారుక మచ్చల పురుగు, కాయ ఈగ నుంచి పంటను కాపాడుకోవాలి.

-కె.స్వాతి, ఏఓ

11 ఎకరాల్లో పంట సాగు చేశా



వేరుశనగ సాగులో వరుసగా నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది 11 ఎకరాల్లో కంది సాగు చేశాను. వర్షాలు కూడా క్రమం తప్పకుండా పడుతుండటంతో ఈ ఏడాది పంట చాలా ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంది. పురుగు, తెగుళ్ల బెడద లేకుండా పంటను కాపాడుకోగలిగితే ఈ సారి మంచి దిగుబడి సాధించి కష్టాల నుండి బయటపడాలని ఆశగా ఎదురుచూస్తున్నాను.

-చక్రవర్తి, రైతు, గుంతకల్లు

క్లుప్తంగా

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి

గుంతకల్లు రూరల్: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యం కాపాడుకోవచ్చని గుంతకల్లు ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మల్లేనిపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సృష్టి కర్త ఏసు క్రీస్తే మనకు గురువు అన్నారు. చీకటిలో నుంచి వెలుగులోకి, అజ్ఞానంలో నుంచి జ్ఞానంలోకి నడిపించు ప్రభువు క్రీస్తు మాత్రమే అన్నారు కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించండి

గుత్తి: ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో రూ.మూడు కోట్లు ఆస్తి పన్ను (ప్రాపర్టీ టాక్స్) బకాయిలు ఉన్నాయన్నారు. పెద్ద హోటళ్లు, లాడ్జిలు, దుకాణాలు నిర్వాహకులు అధికంగా ఆస్తి పన్ను బకాయి పడ్డారన్నారు. ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి నోటీసులు పంపుతామన్నారు. నోటీసులకు స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారు వెంటనే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెల్లించాలని కోరారు.

ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐగా గురునాథ్‌రెడ్డి



గుత్తి: గుత్తి ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐగా గురునాథ్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న శివసాగర్ గుంతకల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. దీంతో మడకశిర బార్డర్ మొబైల్ పార్టీ సీఐగా పనిచేస్తున్న గురునాథ్‌రెడ్డిని గుత్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 18 మద్యం షాపులకు టెండర్లు ఆహ్వానించామన్నారు. గుత్తి మున్సిపాలిటీలో ఐదు, రూరల్‌లో రెండు, పెద్దవడుగూరులో మూడు, పామిడిలో నాలుగు, యాడికిలో నాలుగు షాపుల చొప్పున టెండర్లు పిలిచామన్నారు. ఈ నెల 11న అనంతపురంలో లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు


మట్కా బీటర్లను అరెస్టు చూపుతున్న సీఐ

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో మట్కా బీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొండపాడు గ్రామంలో కొన్ని నెలలుగా మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. మట్కా ఆడిస్తున్న ఎం.కంబగిరి, ఎం.ప్రభావతి, కె.దస్తగిరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.27.100 నగదు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, చంద్ర, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

3 ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వివరాలు.. మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య, దాసరి నారాయణస్వామి, అన్వేష్‌కుమార్ పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపుకుని యాడికి మీదుగా తరలిస్తుండటంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

చివరి ఆయకట్టు వరకూ నీరందించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెద్దవడుగూరు: హెచ్చెల్సీ నీరు చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి దస్తగిరి, మండల కమిటీ సభ్యులు ఈశ్వరరెడ్డి, మద్దిలేటి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో సీపీఎం మండల మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తీర్మానించారు. హెచ్చెల్సీ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని, ఇల్లు లేని పేదలకు పట్టాలు మంజూరు చేయాలని, పెద్దవడుగూరులో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని, 2023లో పంట నష్టపోయిన రైతులకు ఇన్సురెన్స్ అందించాలని, ఉపాధిలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

గార్లదిన్నె: ఎన్నికల సమయంలో 'కూటమి' నాయకులు రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మర్తాడులో మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. సకాలంలో ఆయకట్టుకు నీరు అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే ఖరీఫ్ ముగిసినా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రైతులకు అందించలేదన్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చెన్నా రెడ్డి, సహాయ కార్యదర్శిగా నల్లప్ప, 10 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్య క్రమంలో పరిశీలకులు ఆర్వీనాయుడు, నాగేంద్రకుమార్, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణీ నమోస్తుతే..

సాక్షి నెట్‌వర్క్: నవరాత్రుల మహోత్సవాలు గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారు ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు.


తాడిపత్రి అర్బన్: గాయత్రీదేవిగా పార్వతీదేవి


తాడిపత్రి అర్బన్: లలితా త్రిపుర సుందరిగా విజయచౌడేశ్వరీదేవి


గుంతకల్లు: అభిరామదేవిగా వాసవీమాత


గుంతకల్లుటౌన్: లలితా దేవిగా మారెమ్మ


గుంతకల్లు రూరల్: కౌమారిదేవిగా కొల్హాపూర్ మహాలక్ష్మి


గుత్తి: అన్నపూర్ణాదేవిగా వాసవీమాత


యాడికి: అన్నపూర్ణాదేవిగా పెద్దమ్మ తల్లి


గుత్తి రూరల్: సేవాగఢ్‌లో లలితా దేవిగా మాతా జగదాంబ


పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో అన్నపూర్ణదేవిగా చౌడేశ్వరీదేవి

తాగునీరు వృథా.. తప్పదు వ్యథ


వెంకటాపురంలో వృథాగా పోతున్న నీరు


బుక్కరాయసముద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇలా..

బుక్కరాయసముద్రం: గుక్కెడు మంచి నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో వాటర్ ట్యాంకుల వద్ద తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ట్యాంకుల వద్ద, కుళాయిల వద్ద నీరు వృథా అవుతోంది. ఈ దృశ్యాలను సాక్షి కెమెరాతో క్లిక్ మనిపించింది.

మట్కా, పేకాటపై సమాచారమివ్వండి

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రాంప్రసాద్ సూచించారు. ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే దాడులు చేసి అరికడతామన్నారు. అలాగే ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పోలీస్‌సేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

బేతాపల్లిలో 15న ధ్వజస్తంభ ప్రతిష్ట

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో ఉన్న వరలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15న ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. 15వ తేదీ ఉదయం గణపతి పూజ, స్వస్తి వాచనం, కంకణధారణ, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 16న అభిషేకాలు, రుద్ర స్వాహాకార హోమం, 17న ఉదయం 7 గంటలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.

బాధితులకు బంగారు నగల అప్పగింత

తాడిపత్రి అర్బన్: ఆటోలో బంగారు నగల బ్యాగును మర్చిపోయిన దంపతులకు తిరిగి పోలీసులు బంగారు నగల బ్యాగును అప్పగించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆదివారం గురుప్రసాద్, వాణి దంపతులు కడప నుంచి రైలులో తాడిపత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి దంపతులు తమ లగేజీతో ఆటోలో పట్టణంలోని ఇంటికి వెళ్లారు. ఇంటికి వెళ్లాక మూడున్నర తులం బంగారు నగలున్న బ్యాగు కనిపించకపోవడంతో వెంటనే అర్బన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆటోను వెతికి పట్టుకుని బంగారు నగలు గల బ్యాగును బాధితులకు అందజేశారు. దీంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాయం అందించి ఆదుకోండి

పామిడి: అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు సాయం అందించాలని భావసార క్షత్రియ సమాజ్ ఆదివారం కోరింది. వివరాలు.. పట్టణంలోని మహేంద్రకర్ రఘు కుమార్తె యశ్వనికి మెదడులో రక్తం గడ్డకట్టడంతో వారం రోజులుగా యశ్వని బెంగుళూరులోని హృదయాలయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. యశ్వని వైద్య శస్త్ర చికిత్సకు రూ.7లక్షలు ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. స్థానిక సమాజ్ సభ్యులు స్పందించి రఘు కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. సాయం చేయదలచిన వారు సెల్‌నంబర్ 9866320265ను సంప్రదించాలన్నారు.

సబ్ డివిజన్ డీఈఈగా నాగేంద్ర



గుంతకల్లు: గుంతకల్లు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా నాగేంద్ర బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న రంగస్వామిని అనంతపురం కార్యాలయంలోని గుత్తి విభాగం కన్స్ట్రక్షన్ డిప్యూటీ డీఈఈగా బదిలీ చేశారు. ఆ స్థానంలో చెన్నేకొత్తపల్లి ట్రాన్స్‌కో డీఈఈ నాగేంద్రను గుంతకల్లుకు బదిలీ చేయగా శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది ఆయన పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగే ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు హజరు కావాలని తహసీల్దారు నాగరాజు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్జీ దారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

ఊరెళ్తున్నారా..తస్మాత్ జాగ్రత్త!


మనోహర్, వన్‌టౌన్ సీఐ

గుంతకల్లుటౌన్: దసరా సెలవులని విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటే..దొంగలతో చాలా అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ సూచించారు. ప్రజలు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దోచేస్తారన్నారు. దొంగతనాల నివారణకు పోలీసు శాఖ సూచించిన జాగ్రత్తలను పాటించాలని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెలవులకు ఊరెళ్లేటప్పుడు ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లు లేదా బంధువుల ఇళ్లల్లో పెట్టి వెళ్లాలన్నారు. ఇంటికి తాళం వేసిన విషయాన్ని వన్‌టౌన్ పీఎస్‌లో సమాచారమిస్తే రహస్య కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు బీట్ పోలీసుల చేత ప్రత్యేక నిఘా పెడతామన్నారు. బ్యాంకుల వద్ద డబ్బులు డ్రా చేసుకుని బైక్‌పై వెళ్లే వారిపై కుప్పం ఓజీ గ్యాంగ్, ఇరానీ గ్యాంగ్ దొంగలు నిఘా ఉంచి, ప్రజల దృష్టి మరల్చి డబ్బును దోచుకెళ్లే ప్రమాదముందన్నారు. పండుగ వేళ పలు కంపెనీలిచ్చే ఆఫర్ల మాయలోపడి సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులు తిరుగుతుంటే 100 లేదా 9440796821 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

బీకేఎస్‌లో జోరుగా వర్షం


తాడిపత్రి రహదారిపై వర్షం కురుస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంతోపాటు గోవిందపల్లి, కొట్టాలపల్లి, జంతలూరు, పొడరాళ్ల, రేగడి కొత్తూరు. నీలాంపల్లి భద్రంపల్లి, బోయకొట్టాల తదితర గ్రామాల్లో ఆదివారం వర్షం జోరుగా కురిసింది. ఈ వర్షంతో వరిలో అగ్గి తెగులు నివారణ, మొక్క జొన్న పంటలకు చాలా మేలు అని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం లో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎద్దు పొడిచి రైతుకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో ఆదివారం ఎద్దు పొడిచి రామాంజనేయులు అనే రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. రామాంజనేయులు పొలంలో ఎద్దులను మేత కోసం తోలుకెళ్లాడు. ఈ సమయంలో ఒక ఎద్దు అతడి కడుపులోకి పొడిచింది. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.